www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి


8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -270 ఆదివారం 04 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వెనిజులాపై అమెరికా దాడి

- డ్రగ్స్ పేరుతో చమురు కోసం దాడి
- కారకస్ సహా పలు ప్రాంతాల్లో బాంబుల మోత
- దేశంలో అత్యవసర పరిస్థితి
- అమెరికా కస్టడీలో మదురో దంపతులు
- తమ నేత ఆచూకీ చెప్పాలన్న వెనిజులా
- అమెరికాది క్రిమినల్ చర్య అంటూ ఖండన
- ట్రంప్ దూకుడును ఖండించిన దేశాలు



2లో.

## 14 మంది మావోయిస్టుల మృతి

**దక్షిణ బస్తర్ జిల్లా అడవుల్లో కాల్పుల మోత**

**ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన కాల్పులు**

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకుపడుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందడంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. మిగతా 2లో...



## డ్రగ్స్ కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఈగల్ బృందం**

**ఆది కుమారుడు సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు**



**హైదరాబాద్,జనవరి 3 ప్రజావినికిడి,**

కడప జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డితో పాటు మరొకరు డ్రగ్స్ తీసుకుంటుండగా హైదరాబాద్ 'ఈగల్' బృందం అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నానక్‌రాం గూడలోని గేటెడ్ కమ్యూనిటీలో కొంతమంది డ్రగ్స్ సేవిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో ఈగల్ బృందం అధికారులు రంగంలో దిగారు. నార్సింగ్ పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. గేటెడ్ కమ్యూనిటీలోనిమిగతా 2లో...

## కొండగట్టు అభివృద్ధికి సహకారం

### అంజన్న దయతోనే పునర్జన్మ

- -ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- -కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు
- -వసతిగదులు, దీక్షావిరమణ మండపానికి భూమిపూజ





**కొండగట్టు జనవరి 3 ప్రజావినికిడి,**


ఆంజన్న ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో దీక్ష విరమణ మండపం, 96 గదుల వసతి సముదాయ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా పవన్ కల్యాణ్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు ఘన స్వాగతం పలికారు.మిగతా 2లో...

## కొత్త ఏడాది పెట్టుబడుల కు కొత్త జోష్

- కొత్త ఏడాదికి శుభవార్తతో శ్రీకారం
- ఇదే స్ఫూర్తితో మరిన్ని పెట్టుబడుల సాధనకు కృషి
- ఏపీ టాప్‌లో నిలవడంపై సీఎం చంద్రబాబు

**అమరావతి,జనవరి 3 ప్రజావినికిడి,**

పెట్టుబడుల సాధనలో దేశంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్న వార్త రాష్ట్ర ప్రజలందరికీ గర్వించదగినదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ నంబర్‌వన్ స్థానంలో ఉందంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికను ఉటంకిస్తూ ఫోర్బ్స్ ఇండియా తాజాగా ప్రచురించిన కథనంపై స్పందించారు. కొత్త ఏడాదిని ఉత్తేజకరమైన శుభవార్తతో ప్రారంభిస్తున్నామని, పాలకుల విజన్, సంస్కరణల ప్రభావాన్ని ఇది ప్రతిఫలిస్తోందని ఎక్స్‌లో పోస్టు చేశారు.మిగతా 2లో...



## స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

**సవరణ బిల్లును ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ**

**ఆవశ్యకతను వివరించిన మంత్రి సీతక్క**

హైదరాబాద్,**జనవరి 3 ప్రజావినికిడి,**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌ను సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ శనివారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా, గత కొన్ని దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అంటే, ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్న వ్యక్తులు మిగతా 2లో...



## అసెంబ్లీలో కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

**సభలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్లపై స్పీకర్‌కు లేఖ రాసిన సంగతిని ఉత్తమ్ మరిచారా బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**

**ఆటో డ్రైవర్ల అరెస్టులు దుర్మార్గం : కేటీఆర్**

**హైదరాబాద్, జనవరి 3 ప్రజావినికిడి,**

కాంగ్రెస్ పార్టీ శాసనసభ వేదికగా రాజకీయ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని బీఆర్ఎవీసఎల్పీ ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంప్రదాయాలు, విలువలంటూ నీతులు చెప్పిన కాంగ్రెస్ నాయకులు,



## గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం



- డ్రగ్స్ నిర్మూలనకు ఇచ్ఛాపురం నాంది పలకాలి : హోం మంత్రి అనిత
- వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి అడ్డాగా మార్చింది: కేంద్ర మంత్రి రామ్మోహన్
- ముగిసిన 'అభ్యుదయం సైకిల్‌యాత్ర'
- 53 రోజుల్లో 1,300 కి.మీ. సాగిన యాత్ర

ఇచ్ఛాపురం,**జనవరి 3 ప్రజావినికిడి,**

: "గంజాయి రహిత రాష్ట్రమే సీఎం చంద్రబాబు లక్ష్యం. దీనిలో భాగంగానే గతేడాది నవంబరు 13న ఉమ్మడి విశాఖ జిల్లా పాయకరావు పేట నుంచి ఇచ్ఛాపురం వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అభ్యుదయం సైకిల్ యాత్ర'కు శ్రీకారం చుట్టాం." అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇచ్ఛాపురంలోని సురంగిరాజా మైదానంలో శనివారం 'అభ్యుదయం సైకిల్ యాత్ర' ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనకు ఇచ్ఛాపురం నాంది పలకాలన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ..మిగతా 2లో...

## 'కాళేశ్వరం'పై ఉన్న శ్రద్ధ పాలమూరుపై లేదు

**కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పీపీటీ**

**హైదరాబాద్‌జనవరి 3 ప్రజావినికిడి,**

బీఆర్ఎస్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టుపై పెట్టిన శ్రద్ధ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పెట్టలేదని రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేవలం 30శాతం నిధులను మాత్రమే ఖర్చుపెట్టి అన్యాయం చేశారని నిరసన తెలిపారు. శాసనసభలో స్పీకర్ జి ప్రసాద్‌కుమార్ అనుమతి మేరకు శనివారం కృష్ణా,



## దోషి కేసీఆరే

- ప్రాజెక్టులకు మరణశాసనం రాసింది ఆయనే
- వాటిని ఏపీకి తనఖాపెట్టిన ఘనుడాయన
- ప్రాణమున్నంత వరకు రాష్ట్ర ప్రయోజనాల కోసమే పని చేస్తా
- మా చిత్తశుద్ధిని శంకిస్తే తోలుతీస్తామన్న వారి నాలుకలు కోస్తా
- బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో బలమైన వాదనలు వినిపిస్తాం
- 'నీళ్లు-నిజాలు'పై అసెంబ్లీలో నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రయివేటు యూనివర్సిటీల బిల్లు ప్రతిపాదన
- ఉభయసభలు సోమవారానికి వాయిదా

హైదరాబాద్**జనవరి 3 ప్రజావినికిడి,**

తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు మరణ శాసనం రాసిందే మాజీ సీఎం కేసీఆర్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రాజెక్టును ఏపీకి తనఖా పెట్టిన ఘనుడాయనంటూ ఎద్దేవా చేశారు. చచ్చినా తెలంగాణ కోసమే.. బతికినా తెలంగాణ కోసమేమిగతా 2లో...



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కొండగట్టు అభివృద్ధికి సహకారం అందిస్తా






(మొదటి పేజీ తరువాయి)
పవన్ పర్యటన సందర్భంగా పోలీసులు కొండగట్టు, నాచుపల్లి ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.అభివాదం..సన్మానాలతో పవన్ పర్యటన–తరలివచ్చిన అభిమానులుజగిత్యాల, జనవరి3 (ఆంధ్రజ్యోతి): సెంటిమెంటు.. పూజలు.. అభివాదాలు.. సన్మానాలతో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ శనివారం జిల్లా పర్యటన కొనసాగింది. హైదరాబాద్ నుంచి చాపర్ ద్వారా కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ వద్ద గల హెలీప్యాడ్‌కు పవన్ కల్యాణ్ చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా కొండగట్టు దేవస్థానానికి వచ్చారు. దారిపొడవుగా నిలిచి ఉన్న అభిమానులు, కార్యకర్తలకు పవన్ అభివాదం చేస్తూ వెళ్లారు. దేవస్థానానికి వచ్చిన పవన్ కల్యాణ్‌ను ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో పలు పూజలను నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం పవన్‌కల్యాణ్‌ను అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొండగట్టుపైకి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు, భక్తులనుద్దేశించి కొద్దిసేపు ప్రసంగించారు. అనంతరం కొండగట్టు శివారులోని బృందావన్ ఫ్యామిలీ రిసార్ట్స్‌కు వెళ్లారు. దారి మధ్యలో జేఎన్‌టీయూ వద్ద కొద్దిసేపు ఆగి అభిమానులకు, జనసేన కార్యకర్తలకు అభివాదం చేశారు. బృందావన్ ఫ్యామిలీ రిసార్ట్స్‌లో అభిమానులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. కొద్దిసేపు మీడియాతో ముచ్చటించారు. రిసార్ట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలుపొందిన 148 మంది సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను అభినందించారు. జనసేన కార్యకర్తలతో కొద్దిసేపు భేటీ అయ్యారు. పలు రాజకీయ అంశాలు, ఇతర అంశాలపై జనసేన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా జేఎన్‌టీయూ వద్ద హెలీప్యాడ్ ప్రాంతానికి వెళ్లి చాపర్ ద్వారా తిరుగు ప్రయాణం అయ్యారు. జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. జైజై జనసేన అంటూ అభిమానులు నినాదాలు చేశారు.

# వెనిజులాపై అమెరికా దాడి

కారకస్ : మొత్తానికి అందరూ ఊహిస్తున్నదే జరిగింది. చమురుపై పెత్తనం కోసం తమకు పక్కలో బల్లెంలా నిలిచిన వెనిజులాపై అమెరికా దారుణంగా విరుచుకుపడింది. శనివారం తెల్లవారు జామున రాజధాని కారకస్ నగరంపై అమెరికా సైనిక బలగాలు పెద్ద ఎత్తున దాడులు జరిపాయి. అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను దేశం నుంచి తరలించాయి. వారిద్దరూ తమ అధీనంలోనే వున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించిన ట్రంప్, అమెరికా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బలగాల సహకారంతో పని పూర్తి చేశామన్నారు. మదురోపై క్రిమినల్ అభియోగాల విచారణ వుంటుందని చెప్పారు. వెనిజులాలోని పలు రాష్ట్రాల్లో కూడా దాడులు జరిగినట్లు వార్తలందాయి. శనివారం తెల్లవారు జాము నుంచి చాలా వేగంగా ఈ పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి.వెనిజులా గగనతలాన్ని ఉపయోగించవద్దంటూ దాడులకు ముందుగానే అమెరికా విమానయాన సంస్థలకు హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు దేశంలోని పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలు, నివాస సముదాయాలే లక్ష్యంగా దాడులు జరిగాయని వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్ తెలిపారు. ప్రభుత్వ టీవీతో టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఆమె, తమ అధ్యక్షుడు ఆయన భార్య జీవించి వున్నారా లేదా చెప్పాలని, ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆర్మీలో అత్యున్నత మిషన్ యూనిట్ అయిన ఎలైట్ డెల్టా ఫోర్స్ సభ్యులు మదురో దంపతులను కస్టడీలోకి తీసుకున్నట్లు మీడియా వార్తలు పేర్కొన్నాయి. కాగా అమెరికా మిలటరీ చర్యను పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయంగా తీవ్ర నిరసనలు వ్యక్త మవుతున్నాయి. తొలుత శనివారం తెల్లవారు జామున రాజధాని నగరంలో ఏడు చోట్ల పేలుళ్ళు సంభవించాయి.నగరంలో పలు చోట్ల దట్టమైన పొగ కమ్ముకున్న, ప్రజలు వీధుల్లో పరుగులు పెడుతున్న దృశ్యాలు కనిపించాయి. కారకస్ గగనతలంలో పలు అమెరికా చినూక్ మిలటరీ హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న వీడియోతో సహా ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వీడియోలు బయటకు వచ్చాయి. బాంబు దాడుల కారణంగా కారకస్‌లోని మిలటరీ బేస్‌తో సహా పలు ప్రాంతాల్లో అంధకారం అలుముకుంది. తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానాల శబ్దాలు కూడా వినిపించాయని అధికారులు తెలిపారు. నెలల తరబడి తమపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు సాగించిన ట్రంప్ చివరకు పౌర, సైనిక స్థావరాలపై దాడులకు తెగించారని మదురో ప్రభుత్వం విమర్శించింది.దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించింది. పెద్ద ఎత్తున సైనిక బలగాలను మోహరించినట్టు తెలిపింది. పదాతి, నావికా, వైమానిక బలగాలను అప్రమత్తం చేసినట్టు తెలిపింది. 'మన గడ్డపై అమెరికా బలగాలు విచక్షణారహితంగా దాడులకు బరితెగించాయి. వారి యుద్ధ విమానాల నుంచి క్షిపణులు, రాకెట్లు మన ప్రజల ఆవాసాలపై విరుచుకుపడుతున్నాయి." అని వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ సోషల్ మీడియాలో వీడియో ప్రకటన చేశారు. దక్షిణ కారకస్‌లోని అతి పెద్ద మిలటరీ సముదాయంపై, మిరాండా, అరగ్వా, లా గుయిరా, రాష్ట్రాల్లో కూడా దాడులు జరిగాయని లోపెజ్ తెలిపారు. ఈ దాడులతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలను అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

# దోషి కేసీఆరే



(మొదటి పేజీ తరువాయి)
..ప్రాణమున్నంత వరకు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసమే పని చేస్తాం%ౌ%' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలన్నదే తమ ఆలోచనని ఆయన తెలిపారు. 'దేవుడి మీద ఆన.. నేను ఉన్నంత వరకు తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీయను%ౌ%' అని సీఎం భావోద్వేగంతో చెప్పారు. ఈ విషయంలో తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించొద్దని ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌కు హితవు పలికారు. అలా చేస్తే తమ తోలు తీస్తామన్న వారి నాలుకలు కోస్తామంటూ ఘాటుగా హెచ్చరించారు.శనివారం శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 'నీళ్లు–నిజాలు' అనే అంశంపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. అంతకుముందు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఇచ్చారు. అనంతరం జరిగిన చర్చలో%ౌ%కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు పాల్గొన్నారు. వారు లేవనెత్తిన పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ%ౌ% అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో కూడిన వివరాలను ఉదహరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. రాత్రి 7.22 గంటలకు మొదలైన ఆయన ప్రసంగం రాత్రి 10 గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా సీఎం%ౌ% ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌పైన, మాజీ మంత్రి హరీశ్‌రావుపైన, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైన ఆయన నిప్పులు చెరిగారు. కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ సభ్యులెవరూ సభకు రాకపోవటాన్ని ప్రస్తావిస్తూ సెటైర్లు, వ్యంగ్యాస్త్రాలతో కూడిన విమర్శలను గుప్పించారు.బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరపున బలమైన వాదనలను వినిపించటం ద్వారా ఏడాదిలోగా అన్ని ప్రాజెక్టులకు అనుమతులు తెప్పిస్తామనే ఆశాభావాన్ని సీఎం ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. తద్వారా వాటిని పూర్తి చేస్తామంటూ హామీనిచ్చారు. తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎవ్వరితోనైనా కలబడతాం తప్ప తలవంచబోమని ఆయన స్పష్టం చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లు, అనుభవజ్ఞులు, మేధావులు, ఉన్నత విద్యావంతులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అదృష్టం తనకే దక్కిందని చెప్పారు. అలాంటి ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా కష్టపడతానని తెలిపారు. నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ అసెంబ్లీ బయట గగ్గోలు పెడుతున్న బీఆర్‌ఎస్ అధినేత, ఆ పార్టీ నేతలు.. సభకు ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు.
శాసనసభకే రానప్పుడు వారికి ఎమ్మెల్యే పదవులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవులు ఎందుకంటూ ప్రశ్నించారు. గతంలో ఏపీ మాజీ సీఎం జగన్‌ను తన ఇంటికి పిలిపించి, పంచభక్ష పరమాన్నం పెట్టిన కేసీఆర్.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఓకే చెప్పారంటూ ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి ఏపీ సీఎం చంద్రబాబుపై ఒత్తిడి చేసి, కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి, ఆ స్కీమ్‌ను నిలుపుదల చేయించామని వివరించారు. ఇదీ తమ చిత్తశుద్ధంటూ వ్యాఖ్యానించారు. విషయం, సబ్జెక్టు ఉన్న వారిని వ్యక్తులుగా తాము గౌరవిస్తామని, అదే సమయంలో హక్కులకు భంగం కలిగిస్తే మాత్రం తిరగబడతామని హెచ్చరించారు. అందువల్ల మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ హితవు పలికారు.

## రూ.55 వేల కోట్ల కోసమే

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి జూరాల వద్ద ప్రారంభించాల్సిన దాన్ని, శ్రీశైలం వరకు పొడిగించటం వెనుక పెద్ద కతే ఉందని సీఎం ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లతో కలిసి రూ.55 వేల కోట్లను కొల్లగొట్టేందుకే కేసీఆర్ ఇలాంటి స్కెచ్‌ను వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గం వల్ల ఆ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకూ నీరివ్వలేదని విమర్శించారు. 'పాలమూరు–రంగారెడ్డి' అనేది కేవలం తాగునీటి కోసం ఉద్దేశించి తప్ప సాగునీటి ప్రాజెక్టు కాదంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి సుప్రీంకోర్టు దాకా గగ్గోలు పెట్టింది బీఆర్‌ఎస్ నేతలు, ఆనాటి సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. వారు చేసిన ఈ నిర్వాకం వల్ల ఎన్జీటీ రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఎత్తున పెనాల్టీలు విధించిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌కు సాగునీటిని ఇవ్వాలి, అక్కడకు పరిశ్రమలు రప్పించాలనే ఉద్దేశమే కేసీఆర్‌కు లేదని దుయ్యబట్టారు. అందువల్లే పాలమూరు–రంగారెడ్డిని పక్కనబెట్టారని విమర్శించారు.

# అసెంబ్లీలో కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)
అధికారం రాగానే వాటిని తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం ఆయన ఓ పోస్టు చేశారు. అసెంబ్లీలో ఆడియో, విజువల్ ప్రజంటేషన్ నిర్వహణ భారత పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధమని, అందుకే సభకు హాజరుకాబోమని 2016లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి నాటి స్పీకర్‌కు లేఖ రాసిన విషయాన్ని హరీశ్ గుర్తు చేశారు. ఆ లేఖలో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పద్మావతి కూడా సంతకాలు చేశారని వెల్లడించారు. నాడు స్పీకర్‌కు లేఖ రాసిన ఉత్తమ్ నేడు మంత్రి హోదాలో అసెంబ్లీలో ప్రజంటేషన్‌కు సిద్ధమవ్వడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. నాడు ఉత్తమ్ రాసిన లేఖ ఫొటోను కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో సభా సంప్రదాయాలు, మర్యాదలకు భంగం కలిగిస్తున్నారని, రాజ్యాంగానికే తూట్లు పొడుస్తూ.. అదే తాము తీసుకొస్తున్న మార్పుగా భావిస్తున్నారని హరీశ్ ఆరోపించారు. కాగా, ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటోడ్రైవర్లను అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆటోడ్రైవర్ల జేఏసీ నేతలు, వేలాది మంది ఆటో డ్రైవర్ల అరెస్టులను బీఆర్‌ఎస్ పార్టీ ఖండిస్తోందని శనివారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒకరోజు ముందే అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఆగాలంటే వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన ఆటో డ్రైవర్లను భేషరతుగా విడుదల చేయాలని కోరారు.

# డ్రగ్స్ కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు

(మొదటి పేజీ తరువాయి)
ఓ ఇంట్లోకి ప్రవేశించిన పోలీసు బృందానికి సుధీర్ రెడ్డితో పాటు మరో వ్యక్తి డ్రగ్స్ తీసుకుంటూ కనిపించడంతో మత్తు పదార్థాలతోపాటు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం.. పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి టెస్టులు చేయగా ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది. దీంతో వీరిని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించారు. సుధీర్‌రెడ్డి గతంలో రెండు సార్లు మత్తు పదార్థాలు తీసుకుంటూ పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో అతనిపై ఈగల్ బృందాలు నిఘాను కొనసాగించాయి. తాజాగా మూడోసారి పట్టుబడటంతో డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించామని పోలీసులు తెలిపారు. మరోవైపు, సుధీర్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన వారెవరు?, తరచు ఇంటికే ఎలా అందుతున్నాయి?.. అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు ఈగల్ అధికారులు చెప్పారు.

# కొత్త ఏడాది పెట్టుబడుల కు కొత్త జోష్

(మొదటి పేజీ తరువాయి)
స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎస్క్రో ఖాతాల ప్రకటన, తక్కువ సమయంలో అనుమతులు, ప్రోత్సాహకాలను అందించడం వంటివన్నీ పెట్టుబడుల్లో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాయని పేర్కొన్నారు. తమ వ్యాపారాభివృద్ధికి ఏపీని గమ్యస్థానంగా ఎంచుకున్న పెట్టుబడిదారులకు, వారు ఏపీపై ఉంచిన నమ్మకానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మైలురాయి ఒక ముగింపుగా భావించడం లేదని, నిరంతరం కొనసాగే పురోగతికి ఓ పునాదిగా భావిస్తున్నానని అన్నారు. ఈ స్ఫూర్తితో రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి, మరిన్ని పెట్టుబడులను రాబట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి కేపిటల్‌గా మార్చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తోందని అన్నారు.'అభ్యుదయం' సాగిందిలా..పోలీస్ శాఖ నిర్వహించిన అభ్యుదయం సైకిల్‌యాత్ర నాలుగు జిల్లాల పరిధిలో 53 రోజులపాటు నిర్విరామంగా 1,300 కిలోమీటర్ల మేర సాగింది. గతేడాది నవంబరు 21న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభమైన యాత్ర.. శనివారం ఇచ్ఛాపురంలో ముగిసింది. విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీతోపాటు ఐదు జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో యాత్ర సాగింది. శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది డిసెంబరు 15న ఈ సైకిల్ యాత్ర ప్రవేశించింది. దారి పొడవునా గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల రవాణా, వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై కళారూపాలతో అవగాహన కల్పించారు.

# 14 మంది మావోయిస్టుల మృతి

(మొదటి పేజీ తరువాయి)
ఈ క్రమంలో ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో అటవీ ప్రాంతంలో దాగి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రతా బలగాలు కూడా వెంటనే ప్రతిస్పందించడంతో రెండు వైపులా ఎదురుకాల్పులు జరిగాయి.కాల్పులు ముగిసిన తర్వాత ఆ ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టిన భద్రతా బలగాలకు 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉండే అవకాశముందని భావిస్తున్న భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి.జవాన్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఎన్‌కౌంటర్ జరిగిన కచ్చితమైన ప్రదేశాన్ని అధికారులు ప్రస్తుతం బయటకు వెల్లడించలేదు. పూర్తి వివరాలు గాలింపు చర్యలు ముగిసిన తర్వాత వెల్లడించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# 'కాళేశ్వరం'పై ఉన్న శ్రద్ధ పాలమూరుపై లేదు

(మొదటి పేజీ తరువాయి)
గోదావరి జలాలపై మంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు బీఆర్‌ఎస్ సర్కారు 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని గుర్తు చేశారు.
'కాళేశ్వరంపై రూ. 90 వేల కోట్లు ఖర్చు చేశారనీ, పాలమూరుపై కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే వెచ్చించినట్టు తెలిపారు. కాళేశ్వరం నుంచి రోజుకు మూడు టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచి, పాలమూరులో మాత్రం 1.5 టీఎంసీకి తగ్గించారనీ అన్నారు. ప్రాణహిత–చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారనీ, జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేదని తెలిపారు. రూ. 7469.26 కోట్లు ఖర్చు చేస్తే కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పూర్తయ్యేవని మంత్రి ఉత్తమ్ అన్నారు.

**అక్రమంగా ఏపీకి తరలింపు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి అక్రమంగా నీటిని తరలిస్తుంటే గత బీఆర్‌ఎస్ సర్కారు చూస్తూ కూర్చున్నదని మంత్రి విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలను అంగీకరించి కేసీఆర్ సర్కార్ తీవ్ర అన్యాయం చేసిందని గుర్తు చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం తెలంగాణకు అధిక వాటా రావాల్సి ఉందనీ, మేంవచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించామని వివరించారు. ఒక్క టీఎంసీనే కాదు.. నీటిచుక్కనూ కూడా వదులుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

**బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు తెలంగాణకు కీలకం**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గుర్తు చేశారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నాననీ, కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 72 శాతం వరకు నీటి కేటాయింపులు వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తెలంగా ణకు అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. మొత్తం 814 టీఎంసీల కృష్ణా నీళ్లను తెలంగాణ, ఏపీకి న్యాయంగా కేటాయించాలని కోరారు.

**బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి: మంత్రి శ్రీధర్‌బాబు**

నదీజలాల విషయంలో తెలంగాణ హక్కులు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించేందుకు సభలో లఘు చర్చ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇలాంటి కీలక అంశంపై చర్చ జరిగే సమయంలో బీఆర్‌ఎస్ సభకు గైర్హాజరవడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. నదీ జలాల అంశంపై ప్రజలకు బీఆర్‌ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సైతం పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)
కూడా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయడానికి చట్టపరంగా అర్హత సాధించారు. ఈ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెడుతూ, మారుతున్న కాలానికి , రాష్ట్ర అభివృద్ధి పరిణామాలకు అనుగుణంగా జనాభా పెరుగుదల రేటును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలోనే ఈ నిబంధన తొలగింపును రాజకీయ పక్షాలతో పాటు సాధారణ ప్రజలు కూడా స్వాగతించారని ఆమె గుర్తు చేశారు. గతంలో ఈ నిబంధనపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేశారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ స్థాయి రాజకీయాల్లో నాయకత్వం వహించాలని ఆశపడే ఎంతో మంది అభ్యర్థులకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్లయింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 04 జనవరి 2026

# స్మార్త విద్వత్సభలు రాజతోత్సవములు





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** శనివారం రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ జనార్ధనా నంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 11వ స్మార్త విద్వత్సభలు రాజతోత్సవముల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి,హయత్ నగర్ మండల్ ఎమ్మార్వో జానకి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,స్మార్త విద్వత్సభలు హిందూ ధర్మంలోని స్మార్త సంప్రదాయానికి చెందిన విశిష్ట సమావేశాలని తెలిపారు. వీటి ద్వారా వేదాలు,శాస్త్రాలు, తత్త్వశాస్త్రం, ముఖ్యంగా అద్వైతం, యోగం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయని, అలాగే వేద పారాయణం,వైదిక కర్మల నిర్వహణకు ఇవి ముఖ్య వేదికలుగా నిలుస్తాయని అన్నారు. పండితులు,భక్తులు జ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు సంప్రదాయాలను కాపాడేందుకు ఈ సభలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శూలపాణి,ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు బసవయ్య,ప్రధాన కార్యదర్శి నరసరాజు, మంగపతి రావు, మూర్తి,బాబురావు, బాల్ రెడ్డి,శ్రీధర్, సుధీర్,రాజేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వేడుకలు




**ప్రజావినికిడి, (నాంపల్లి):** తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో సామాజిక విప్లవకారిణి, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు హైదరాబాద్ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారమ్ జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్), అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్,కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వరద రాజు,ఈసీ మెంబర్ ఏ.వి. శ్రీధర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శంకర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీనివాస్ మరియు వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు, యూనిట్ల ఉద్యోగులు పాల్గొన్నారు. సందర్భంగా అధ్యక్షులు మారమ్ జగదీశ్వర్ ప్రసంగిస్తూ.. సావిత్రిబాయి పూలే కేవలం ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక అని కొనియాడారు. సమాజంలో మహిళా విద్యకు పునాదులు వేసిన ఆమె కృషి వల్లనే నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ రంగంలో కూడా మహిళా ప్రాతినిధ్యం పెరగడం వెనుక ఆమె పోరాట స్ఫూర్తి ఉందని, ఆమె ఆశయాలకు అనుగుణంగా టీఎన్జీఓ సంఘం ఎల్లప్పుడూ సామాజిక న్యాయం ఉద్యోగుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తుందని ఉద్ఘాటించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) మాట్లాడుతూ, అజ్ఞానమనే చీకటిని అక్షర జ్ఞానంతో పారద్రోలిన ధీశాలి సావిత్రిబాయి అని కొనియాడారు. అంటరానితనం,వివక్ష వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి దిక్సూచి అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఆమెను స్ఫూర్తిగా తీసుకుని,విధి నిర్వహణలో నిబద్ధతతో ఉంటూనే, సామాజిక బాధ్యతలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. జిల్లా యూనిట్ సభ్యులు ఐకమత్యంతో ఉండి, సంఘం బలోపేతానికి తోడ్పడాలని కోరారు.

# సామాజిక రుగ్మతల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

## విద్యతోపాటు సామాజిక బాధ్యతను బోధించాలి.

## ఉత్తమ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంలో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





**ప్రజావినికిడి,(రంగారెడ్డి):** విద్యార్థులకు పాఠ్యబోధనతో పాటు సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, గొప్ప సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య అజ్ఞానాన్ని దూరం చేస్తుందని నమ్మి బాలిక విద్యకు ఆమె చేసిన కృషి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మహిళల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. 19వ శతాబ్దంలో మహిళలకు విద్య అందించేందుకు అనేక అవాంతరాలను ఎదుర్కొన్న మహాత్మా జ్యోతిరావు పూలే సహకారంతో 1848లో పూణేలో మహిళల కోసం తొలి పాఠశాలను ఏర్పాటు చేసి సావిత్రిబాయి విద్యాబోధన చేశారని గుర్తు చేశారు

**.బాల్యవివాహాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

జిల్లాలో ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్.. ఈ సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పుస్తకాల్లోని పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల్లో సామాజిక అవగాహన కల్పించాలని, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రోత్సహించాలని కోరారు. 13 మంది మహిళా ఉపాధ్యాయులకు సన్మానంఈ కార్యక్రమంలో ఎంపికైన 13 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు

**.ప్రభుత్వ పాఠశాలల బోధనకు ప్రాధాన్యం**

ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించే సామర్థ్యం ఉందని పేర్కొన్న కలెక్టర్..నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పని చేయాలన్నారు. ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు భవిష్యత్తులో మరింత ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే జీవితం..




**ప్రజావినికిడి,(సికింద్రాబాద్):** సావిత్రిబాయి పూలే 195వ జన్మదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ లో ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళ ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మహిళా ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ మాట్లాడుతూ1931లో మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జనవరి 3న జన్మించిన సావిత్రిబాయి తొమ్మిదేళ్ల వయసులోనే జ్యోతిరావు పూలేతో బాల్య వివాహం జరిగిన సమయంలో సావిత్రిబాయికి అక్షరజ్ఞానం లేదని సావిత్రిబాయికి చదువు పట్ల ఆసక్తిని గమనించిన భర్త జ్యోతిరావు పూలే స్వయంగా విద్యను అభ్యసింపజేసి ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించి భారతదేశంలోని మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జీవితం యావత్ మహిళా లోకానికి ఆదర్శమని కృష్ణప్రియ ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి కొనియాడారు. ఆ కాలంలోనే కుల వివక్ష సతి సహగమనం బాల్య వివాహల నిర్మూలన కోసం పోరాడిన వీర వనిత అని అంతే కాకుండా సాహిత్యంలో ప్రజాసేవలో స్త్రీల హక్కుల కోసం పోరాడి భారతీయ స్త్రీవాద పితామహురాలిగా చరిత్ర పుటల్లోకి ఎక్కిందని అన్నారు. మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష నిర్మూలన కేవలం విద్యతోనే సాధ్యమని మహారాష్ట్రలోని పూణేలో మహిళల కోసం సొంత ఖర్చులతో 50 కి పైగా పాఠశాలలు నిర్మించి మహిళలకు విద్యాభ్యాసం అందించి సావిత్రిబాయి పూలే స్వయంగా విద్యాబోధన చేసిందని అన్నారు. మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలో స్త్రీలు పురుషులు అన్ని కులాల వారు సమానమే అనే స్ఫూర్తితో మహిళల పక్షాన పోరాడి మహిళలు ఏ రంగంలోనూ తీసి పోరని నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి,ధన సౌజన్య,శ్రీజ,పార్వతి జ్యోతి వాణి పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సిడిడి ఎంఎస్ఏ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ లత..





**ప్రజావినికిడి,(సూర్యాపేట):** నూతన సంవత్సరం సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మరియు అదనపు కలెక్టర్ సీతా రామారావు లను తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు కలిసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీజీ ఎస్సీ డిడి ఎం ఎస్ ఏ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కార్యాలయ సిబ్బంది శుక్రవారం జిల్లా కలెక్టర్ మరియు అడిషనల్ కలెక్టర్ లను గౌరవప్రదంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ అలాగే అడిషనల్ కలెక్టర్ లను కలిసిన వారిలో శ్రీమతి లత తో పాటు టిజి ఎస్సిడిడి, ఎం ఎస్ ఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణపురం రవి వర్మ, రాధ,యాదగిరి,రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా హోటల్ వింధు పార్క్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం

## పీసీసీ మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు హాజరు



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జనవరి 3,** సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన హోటల్ వింధు పార్క్ (రెస్టారెంట్,బ్యాంక్వెట్, లగ్జరీ రూమ్స్)ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ శుభకార్యానికి కాంగ్రెస్ సీనియర్ నేత పీసీసీ మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై పిసిసి ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేరంగుల కృష్ణ,హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ తో కలిసి హోటల్‌ను రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ,సరూర్ నగర్ ప్రాంతంలో ఇలాంటి నాణ్యమైన వసతి అలాగే ఆహార సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందకరమని, హోటల్ వింధు పార్క్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అలాగే ప్రాంత అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. హోటల్ నిర్వాహకులు పరిశుభ్రత,నాణ్యత మరియు కస్టమర్ సేవలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వారు వ్యాపార రంగంలో మరింత ఎదిగి ముందు మరిన్ని బ్రాంచీలు ప్రారంభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యాజమాన్యం, హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్,కాలనీ వాసులు అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



**ప్రజావినికిడి,(వాజేడు):**ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల,పేరూరు నందు సంఘ సంస్కర్త,స్త్రీ విద్యా ప్రధాత భారత దేశపు ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.అందులో భాగంగా పాఠశాల లోని మహిళా ఉపాధ్యాయురాళ్లను కూడా ఘనంగా సన్మానం చేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్దబోయిన భద్రాచలం (బద్రి),డిప్యూటీ వార్డెన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు నాగమణి,నర్సింగరావుపార్వతి,లక్ష్మి నారాయణ,బాలాజీ, సుమలత విద్యార్థులు పాల్గొన్నారు.

# బి టెక్ విద్యార్థి ఆదృశ్యం

**ప్రజావినికిడి, (శంషాబాద్): జనవరి 3:**



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని వర్ధమన్ యూనివర్సిటీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కొత్తపల్లి ఆకాష్ వర్ధన్ అదృశ్యమయ్యాడు. శంషాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి ఆకాష్ వర్ధన్, S/o లేట్ శ్రీనివాస్ రావు, వయస్సు: 19 సంవత్సరాలు వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. 31.12.2025 నాడు సమయం అందాజ రాత్రి 09:30 గంటల సమయంలో ఆకాష్ వర్ధన్ బయటకు వెళ్ళుటకొరకు అవుట్ పాస్ కావాలని కోరగా, ఆకాష్ వర్ధన్ తల్లి మువ్వా హెప్సిబా కి ఫోన్ చేసి ఆకాష్ వర్ధన్ కి బయటకు వెళ్ళుటకు అవుట్ పాస్ ఇస్తున్నామని చెప్పగా ఆమె తన అబ్బాయిని బయటికి పంపించండి అని చెప్పగా వారు అతనికి అవుట్ పాస్ ఇవ్వడం జరిగింది. ఆకాష్ వర్ధన్ అవుట్ పాస్ తీసుకుని తేదీ: 01.01.2026 నాడు సమయం అందాజ సాయంత్రం 05:30 గంటల సమయంలో కాలేజ్ బాయ్స్ హాస్టల్ నుండి బయటికి వెళ్లాడు. అయితే ఆకాష్ వర్ధన్ కాలేజీకి రాకపోవడంతో తన తల్లి కి ఫోన్ చేసి హాస్టల్ కి రాలేదని చెప్పగా, ఆమె వారితో కుమారుడు ఆమె వద్దకి కూడా రాలేదని తెలిపింది.అతని తల్లి కుమారుడు యొక్క ఫోన్ నెంబర్ కి కాల్ చేయగా అతను ఉంటున్న రూమ్ లో బ్యాగ్ దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ ఆకాష్ వర్ధన్ యొక్క బ్యాగ్ లో నుండి రింగ్ టోన్ సౌండ్ వస్తున్నదని తెలిసి అతని యొక్క బ్యాగ్ ఓపెన్ చేసి చూడగా అతని ఫోన్ హాస్టల్ లోనే పెట్టి వెళ్లడాని తెలిసింది. వెంటనే ఆకాష్ వర్ధన్ గురించి చుట్టుప్రక్కల ప్రాంతాలలో,వారి బందువుల వద్ద ఎంత వెతికినా కూడా అతని యొక్క ఆచూకి లభించకపోవడంతో పి. యస్. కు వచ్చి ఫిర్యాదు చేయనైనది. ఆకాష్ వర్ధన్ యొక్క ఎత్తు: 5.9“, కలర్: తెలుపు, భాషలు: తెలుగు & ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలడు.యు దుస్తులు: పసుపు కలర్ టి షర్ట్, ఆష్ కలర్ ఫ్యాంట్ ధరించినాడు.విషయం6 పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నర్కుడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం




**ప్రజావినికిడి, (శంషాబాద్): జనవరి 3,** భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది అందులో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ మరియు తృతీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు బాలస్వామి మాట్లాడుతూబాలికా విద్య, బలహీన వర్గాల విద్య, స్త్రీల హక్కులు, సమాజంలోని అసమానతలపై సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఎపిలో కూడా ఇలా జరగలేదు

## స్పీకర్ తీరు బాధాకరమన్న గంగుల కమలాకర్

హైదరాబాద్,జనవరి3 (ఆర్ఎన్ఎ): ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు.

# బాలికల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయం

## టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

**ప్రజావినికిడి శంషాబాద్ జనవరి 3,** సావిత్రిబాయి పూలే చేసిన బాలికల విద్య కోసం సేవలు చిరస్మరణీయం అని టిఎస్ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ టిఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ కి సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎస్-ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ మాట్లాడుతూ, భారతదేశంలో మహిళా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా బాలికల విద్య కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అనేక అవమానాలు, అడ్డంకులను ఎదుర్కొని కూడా విద్య అనే ఆయుధంతో సమాజాన్ని మార్చిన గొప్ప పోరాట యోధురాలిగా



సావిత్రిబాయి పూలే నిలిచారని అన్నారు.ఎప్పుడు మనం పొందుతున్న విద్యా హక్కులు,సమానత్వ భావనలన్నీ సావిత్రిబాయి పూలే వంటి మహానుభావుల త్యాగ ఫలితమేనని పేర్కొన్నారు. ఆమె ఆలోచనలను విద్యార్థులు ఆచరణలో పెట్టి, సామాజిక మార్పుకు కారకులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు,టిఎస్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరంలో 200 మందికి పైగా లబ్ధి






**ప్రజావినికిడి,(హైదరాబాద్**

టిసివప్రియ సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్- మెడి ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించి, 200 మందికి పైగా రోగులు వైద్య మరియు మానసిక ఆరోగ్య సేవలను పొందారు.ఈ కార్యక్రమానికి మామతా మెడికల్ కాలేజ్‌కు చెందిన ప్రొఫెసర్ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై, నివారణాత్మక వైద్యం మరియు సమాజ ఆరోగ్య సేవల ప్రాధాన్యతను వివరించారు.ఈ శిబిరంలో సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డా. మార్కండేయులు, స్త్రీరోగ వైద్య సేవలు డా.అక్షిత తుమ్మ (MBBS,FGO), సీనియర్ సైకాలజిస్ట్ మరియు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డా.ఎన్. వెంకటేశ్వర్లు,డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డా. అన్వేష్,అలాగే నేత్ర వైద్య సేవలు అందించిన డా.ప్రసన్న తమ సేవలను అందించారు.ప్రత్యేకంగా మానసిక ఆరోగ్య సేవలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మానసిక సంక్షేమంపై అవగాహన కల్పించారు.సైకో మ్యూజిక్ & ఆర్ట్ థెరపిస్ట్ శ్రీమతి విధేహి దలాల్ మానసిక ఆరోగ్య చికిత్సలో సృజనాత్మక పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ హరిశంకర్ సమన్వయం చేయగా, ఈసీజీ ఫౌండేషన్కు చెందిన సుదర్శన్, రామారావు,శాంతన్ల సహకారం శిబిరం విజయవంతానికి దోహదపడింది.ఇలాంటి ప్రజారోగ్య కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మూడోరోజు అసెంబ్లీ ప్రారంభం

## సమస్యలపై బిజెపి ఎమ్మెల్యే ప్రస్తావన -చనాక కోరాట నిర్వాసిత సమస్యలపై పాయల శంకర్ వెల్లడి

హైదరాబాద్,**జనవరి 3 ప్రజావినికిడి,** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు శనివారం ప్రారంభం అయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభలో లేవనెత్తారు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయలే పరిహారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. పదేళ్లు అయ్యిందన్నారు. నీళ్లు రాలేదని.. పరిహారం రాలేదని ఆదిలాబాద్ రైతులు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని




ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జైనాథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని... ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ్గ÷ళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. రైతులకు భారీ లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేశారు. అలాగే ప్రిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ.2,000 కోట్లు కేటాయించాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండు వేల కోట్లు విడుదల చేస్తేనే నిజాంసాగర్ కాలువల ఆధునీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, స్వరాష్ట్రంలోనూ నిజామాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా నీటిపారుదల శాఖ మంత్రి నవ్వుతూనే ఉన్నారని, కానీ సమస్యలపై స్పష్టమైన చర్యలు లేవని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే్గ÷డి రాకేష్ రెడ్డి ఆరోపించారు.

# ఆనాడు విపక్షంలో అన్నదేమిా..ఇప్పుడు చేస్తున్నదేమిటి

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కామనలేదా -నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు

హైదరాబాద్,**జనవరి 3 ప్రజావినికిడి,** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార



పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## 10 నుంచి ఉపాధి హామీ బచావో సంగ్రామ్




న్యూఢిల్లీ, **జనవరి 3 ప్రజావినికిడి,** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను పునరుద్ధరించాలని, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ 45 రోజుల పాటు దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించనుంది. ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో సంగ్రామ్ పేరిట ఈనెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు ఈ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్ శనివారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 10న జిల్లా స్థాయిలో విలేకరుల సమావేశాలు నిర్వహించి, రోజంతా నిరాహారదీక్షలు చేస్తామని, 11న జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. 12 నుంచి 29 వరకు అన్ని గ్రామాల్లో పంచాయతీ స్థాయి సమావేశాలు, ఇంటింటికీ తిరిగి చైతన్యం కలిగించే కార్యక్ర మాలు నిర్వహిస్తామని తెలిపారు. 30న వార్డు స్థాయిలో శాంతియుత ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 15వ తేదీ వరకు విధాన సభల వద్ద రాష్ట్రస్థాయి ఘెరావ్‌లు, ఫిబ్రవరి 16 నుంచి 25 వరకు నాలుగు ప్రధాన ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే...

### - స్త్రీ విద్యకు, సామాజిక న్యాయానికి చిరస్మరణీయ పోరాటం

**జనవరి 3 ప్రజావినికిడి,**



భారతదేశంలో మహిళా విద్యకు బాటలు వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే. స్త్రీల విద్య, సమానత్వం, సామాజిక సంస్కరణల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ఉద్యమకారిణి ఆమె. తన సహచరుడు, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలేతో కలిసి అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతర ఉద్యమం సాగించారు...1848 జనవరి 1న పూణేలో భారతదేశ తొలి మహిళా పాఠశాలను స్థాపించి, కుల, మత, లింగ భేదాలు లేకుండా విద్య అందించారు. అదే సంవత్సరంలో మే 12న దళితులకు తొలి పాఠశాలను ప్రారంభించి, నాలుగు సంవత్సరాల్లోనే సుమారు 20 పాఠశాలలను స్థాపించడం ఆమె అద్భుతమైన విద్యా కృషికి నిదర్శనం.మధ్యాహ్న భోజనం, ఉచిత విద్య వంటి సంస్కరణలను అమలు చేసి, విద్య అందరికీ హక్కు అనే భావనను ముందుకు తెచ్చారు.వితంతువులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమ సంతాన శిశువుల హత్యలకు వ్యతిరేకంగా 1852లో 'మహిళా సేవా మండలి'ని స్థాపించి పోరాటం సాగించారు. ఆనాథ బాలలు, నిరాశ్రయ స్త్రీల కోసం ఆశ్రమాలు నడిపి, బాల్య వివాహాలు, సతీ సహగమనం, మూఢనమ్మకాలపై ఉద్యమించారు.కరువు కాలంలో సుమారు రెండు వేల మంది ఆనాథ బాలలను ఆశ్రయించి, వారికి విద్య అందించడం ఆమె మానవతా దృక్పథానికి గొప్ప ఉదాహరణ.సత్యశోధక సమాజం ద్వారా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, మహిళల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. కులాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలకు మద్దతు ఇచ్చి సమాజంలో మార్పుకు నాంది పలికారు...1890లో జ్యోతిరావు పూలే మరణించినప్పుడు, అప్పటి సంప్రదాయాలకు విరుద్ధంగా ఆమె స్వయంగా అంత్యక్రియలు నిర్వహించి సామాజిక ఆచారాలను సవాలు చేశారు...విద్యతో పాటు సాహిత్య రంగంలోనూ సావిత్రీబాయి పూలే విశేష కృషి చేశారు. ఆమె మరాఠీ సాహిత్యంలో తొలి ఆధునిక కవయిత్రిగా గుర్తింపు పొందారు...1854లో 'కావ్య పూలే' అనే కవితా సంపుటిని 38 కవితలతో ప్రచురించి, కులలింగ వివక్షలు, విద్య ప్రాముఖ్యతను ఆత్మకథాత్మకంగా వివరించారు.తరువాత 1891లో 'పావన కాశీ సుబోధ్ రత్నాకర్' అనే కావ్యాన్ని వెలువరించగా, ఇది జ్యోతిరావు పూలే జీవిత చరిత్రతో పాటు ఆమె స్వీయ అనుభవాలను ప్రతిబింబిస్తుంది...సావిత్రీబాయి పూలే జీవితం ఒక ఉద్యమం. ఆమె పోరాటాలు, ఆలోచనలు నేటికీ సమానత్వం, సామాజిక న్యాయం కోసం స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి...స్త్రీ విద్యకు పునాది వేసిన ఆ మహనీయురాలు భారత సామాజిక చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు.

# భాష ఓ ప్రపంచాన్ని సృష్టిస్తుంది

**బంధుత్వ బంధాలను ఏర్పాటు చేస్తుంది**
**అది లేకపోతే గుర్తింపు, గౌరవం ఉండదు**
**తెలుగు టీచర్లకు గౌరవమివ్వకుంటే అది సమాజమే కాదు**
**జిల్లా కోర్టు వరకూ ప్రొసీడింగ్స్ తెలుగులోనే ఉండాలి**
**ప్రపంచ తెలుగు మహాసభల్లో జస్టిస్ శ్రీ నరసింహ**



గుంటూరు, **జనవరి 3 ప్రజావినికిడి,**

: 'భాష కేవలం భావ వ్యక్తీకరణే కాదు. దానికి ఒక ప్రపంచాన్ని సృష్టించగలిగే బలం ఉంది. మనం రెండు బంధాలతో పుడతాం. ఒకటి మాతృ బంధం అయితే... రెండోది భాషా బంధం' అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు.శనివారం గుంటూరులో ప్రారంభమైన తెలుగు మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు(గజల్) శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో జస్టిస్ శ్రీ నరసింహ మాతృభాష ప్రాధాన్యతను వివరించారు. 'రాజ్యాంగంలో మూడు ముఖ్యమైన విషయాలు గురించి చెప్పారు. ఒకటి స్వేచ్ఛ, రెండోది సమానత్వం. మూడో దానికి రాజ్యాంగంలో ఏ పదం వాడినా, వాడకపోయినా దానిని తెలుగులో బంధుత్వం అని చెప్పుకోవచ్చు. ఇది చాలా పెద్ద విషయం. బంధుత్వంలో ఉన్న తత్త్వం... కలిపి ఉంచడం. మనమందరం భాష వలన బంధువులం. బంధుత్వం వల్ల గుర్తింపు కలుగుతుంది. ఇతనెవరు అంటే... ఆ బంధం మూలంగా తెలుగువాడు అంటాం. భాష జీవం పోసుకొన్న మనిషిలాంటిదే. మనతోపాటే మనస్సులో, ఆత్మలో ఉంటుంది. వాడుక లేకపోతే మనిషిలానే క్షీణమైపోతుంది. అందుకే భాషని కాపాడుకోవడం చాలా ముఖ్యం. వాడుక లేనిదే భాష ఉండదు. మనకు గౌరవం, గుర్తింపు, బంధం ఉండదు. భాషని వాడుకలో ఉంచుకోవాలంటే పరిపాలన, అధికారిక వ్యవహారాల్లో తప్పనిసరి చేయాలి. జిల్లా కోర్టు వరకు ప్రొసీడింగ్స్ తెలుగు భాషలోనే ఉండాలి. పాఠశాలల్లో తప్పనిసరిగా తెలుగు భాషని అమలు చేయాలి. తెలుగు ఉపాధ్యాయులకు తగిన గౌరవం ఇవ్వడం లేదనేది నా భావన. తెలుగు టీచర్లకి కాళ్లు కడిగి దండం పెట్టాలి. తెలుగు ఉపాధ్యాయులను గౌరవించకపోతే అది సమాజమే కాదు. వారికి గౌరవం ఇచ్చి, కాపాడుకుంటే భాషను కాపాడుకోగలుగుతాం. మంచి నడవడిక తల్లిదండ్రుల పెంపకంలో ఉంటుంది. దానికి భాష తోడౌతుంది. చిన్నప్పటి నుంచి చందమామ పాటలు, చిన్న సామెతలు చెబితే అవి వ్యక్తిత్వంలో ఇమిడిపోతాయి' అని జస్టిస్ శ్రీ నరసింహ వివరించారు.ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండిఎన్టీఆర్ కళావేదికపై కార్యక్రమాలు అభినందనీయం: స్పీకర్ అయ్యన్నతెలుగుని దేశ, విదేశాలకు చాటి చెప్పిన ఎన్టీఆర్ కళావేదికపై తెలుగు మహాసభ కార్యక్రమాలు జరుగుతుండటం అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. 'మాతృ భాషని మరిచిపోతే అమ్మని మరిచినట్లే. తెలుగు భాషని ఎలా ముందుకు తీసుకెళ్లాల్లో ఈ సభల్లో చర్చించి ఆ ప్రతిపాదనలను అందజేస్తే నేను అసెంబ్లీలో చర్చకు పెట్టి ఆమోదం పొందేలా చేస్తా. ఈ మూడు రోజులు ఇక్కడే ఉండి తెలుగు మహాసభలను పర్యవేక్షిస్తా' అని అన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం మాట్లాడుతూ... 'అనతికాలంలో జిల్లా స్థాయి కోర్టుల్లో తీర్పులు తెలుగులో ఇస్తే భాషకు కొంత ప్రోత్సాహం కలుగుతుంది. ఆ దిశగా మనం ప్రయత్నం చేయాలి. న్యాయవృత్తిలో ఉండే ఎన్నో కీలకమైన పదాలకు తెలుగు పర్యాయపదాలు అనువర్తింప చేసుకోవాలి' అని అన్నారు. కనీసం ఎనిమిదో తరగతి వరకు తెలుగు మీడియంలోనే పాఠశాలల్లో విద్యార్థులకు బోధన జరగాలని సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, కొప్పరపు కవుల సాహితీపీఠం నుంచి మా శర్మ, మహాసభల సమన్వయకర్త రామచంద్రరాజు, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాదు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.వైభవంగా ప్రారంభమైన తెలుగు మహాసభలుఆంధ్ర సారస్వత పరిషత్ మూడో ప్రపంచ తెలుగు మహాసభలు - 2026 గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగర ప్రాంగణంలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతాలాపనలు, కవి సమ్మేళనాలతో ప్రాంగణమంతటా తెలుగుదనం తొణికిసలాడింది. తెలుగుతల్లి, వేంకటేశ్వరస్వామి, ఎన్టీ రామారావు విగ్రహాలతో ప్రధాన వేదిక కళకళలాడింది. మొత్తం ఐదు వేదికల మీద వివిధ కార్యక్రమాలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. దేశ, విదేశాల నుంచి తెలుగు భాషాప్రియులు తరలివచ్చారు.

# కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే

### అయినా పట్టించుకోని సిఎం రేవంత్ రెడ్డి -జాగృతి ప్రజాబాటలో కవిత విమర్శలు

సూర్యాపేట,**జనవరి 3 ప్రజావినికిడి,**



తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీవీబీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత. రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళ్లు రాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా అని ౖ÷ర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళ్లు ఇచ్చే డిస్ట్రిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2లో భాగంగా

నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.

-----

# అడ్డగోలుగా హైదరాబాద్ విభజన

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తలసాని

### దమ్ముంటే హైదరాబాద్ పేరు మార్చాలని డిమాండ్

హైదరాబాద్,**జనవరి 3 ప్రజావినికిడి,**



హైదరాబాద్ మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని అసెంబ్లీలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కానీ ఎంతో చరిత్ర ఉన్న సికింద్రాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు విభజిస్తున్నారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. టెక్నికల్ స్టడీ లేకుండానే ప్రాంతాలను విభజిస్తున్నారని అన్నారు. జంట నగరాల ఉనికి లేకుండా కుట్ర చేస్తున్నారని తలసాని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడమని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. మహానగర విభజన పై కాంగ్రెస్ నాయకులకు కనీసం అవగాహన లేదని తలసాని విమర్శించారు. డివిజన్లను కూడా సరిగా విభజించలేదని అన్నారు. 24 నియోజకవర్గాలు ఉన్న మహానగరాన్ని విభజిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం బిఆర్ఎస్ హయాంలో 150 డివిజన్లు చేశామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరాన్ని ఇష్టమొచ్చినట్లు విభజిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పనుల కోసం ప్రజలు నగరం మొత్తం తిరిగే పరిస్థితి తీసుకొస్తున్నారని తెలిపారు. దీనిపై చట్టపరంగా, న్యాయపరంగా పోరాడతామని తెలిపారు.అసెంబ్లీలో కూడా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎంతోమంది ముఖ్య మంత్రులను, స్పీకర్లను చూశాం.. కానీ ఇలాంటి ముఖ్యమంత్రి, స్పీకర్‌ను చూడలేదని అన్నారు. స్పీకర్ కనీసం ప్రతిపక్ష సభ్యుల వైపు చూడటం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడడం ప్రతిపక్ష పార్టీ పని అని.. కానీ ప్రతిపక్ష పార్టీని స్పీకర్ నిలువరిస్తున్నారని అన్నారు. గంటన్నర పాటు రేవంత్ రెడ్డి బూతు పురాణం మాట్లాడుతున్న స్పీకర్ అడ్డు చెప్పలేదని మండిపడ్డారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# ప్రియుడి మోజులో భర్త దారుణ హత్య

### మెదక్ జిల్లాలో దారుణ ఘటన

మెదక్,**జనవరి 3 ప్రజావినికిడి,** మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్ లో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది భార్య.. మద్యం మత్తులో భర్త స్వామి (35) చెరువులో పడి చనిపోయినట్టుగా నమ్మించేందుకు ప్రయత్నం చేసింది. ఇక, పోలీసుల విచారణలో భార్య మౌనిక(28) అక్రమ సంబంధం బాగోతం బయటపడింది. అయితే, 12 ఏళ్ల క్రితం స్వామి, మౌనికలకు పెళ్లి జరగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక, తనకంటే తక్కువ వయస్సున్న సంపత్(23) అనే యువకుడితో ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలియడంతో పంచాయితీ పెడతానని భర్త హెచ్చరించాడు. దీంతో ఎలాగైనా భర్తను చంపేయాలని మౌనిక ఎ÷-లాన్ వేసింది. గత నెల డిసెంబర్ 22వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి నిద్రపోయిన స్వామి.. ఇదే అదనుగా భావించి ప్రియుడిని ఇంటికి పిలిచి ఇద్దరు కలిసి భర్త గొంతు నొక్కి చంపేశారు. ఇక, భర్త స్వామి చనిపోయిన తర్వాత బైక్ పై మృతదేహాన్ని తీసుకెళ్లి నెరేళ్లకుంటలో పడేసి మద్యం మత్తులో పడి చనిపోయినట్టు కిలేడి మౌనిక నమ్మించింది. అయితే, భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో తమ స్టైల్లో పోలీసులు విచారించగా నేరం ఒప్పుకుంది. దీంతో మౌనికతో పాటు ఆమె ప్రియుడు సంపత్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు పోలీసులు.

# లయ తప్పిన గుండెకు కళ్లెం

### గుండె దడ, నొప్పితో ఇద్దరికి తీవ్ర ఇబ్బంది

### చికిత్స చేసి స్వస్థత చేకూర్చిన నిమ్స్ వైద్యులు



నిమ్స్, **జనవరి 3 ప్రజావినికిడి,**

అరుదైన గుండె జబ్బుతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు నిమ్స్ వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. హృదయ స్పందనలో మార్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారికి ఆ బాధల నుంచి విముక్తి కల్పించారు. శనివారం నిమ్స్ ఆస్పత్రిలో ఈ కేసుల వివరాలను నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సాయి సతీశ్ వెల్లడించారు. ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన నిరీష(31)కు ఏడాదిగా తరచూ గుండె నొప్పితో పాటు అధికంగా దడ వచ్చేది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఎవరూ వ్యాధిని గుర్తించలేకపోయారు. నాగారానికి చెందిన ముదాసిర్(21)దీ ఇదే తరహా సమస్య. వీరిద్దరి గుండె 40 నుంచి 50 శాతం అధికంగా కొట్టుకోవడంతో గుండె నొప్పి, దడ, తలతిరగడం జరిగేవి. నిమ్స్ కార్డియాలజీ బృందం నిర్వహించిన పరీక్షల్లో గుండె లోపల విద్యుత్ ప్రసరణలో హెచ్చు తగ్గుల వల్ల ఈ సమస్య వచ్చినట్టు వైద్యులు గుర్తించారు. ఇలా ఎక్కువ రోజులు కొనసాగితే గుండె కండరం బలహీనపడి ఎడమ జఠరిక(ఎల్వి) పనితీరు తగ్గిపోతుంది. అత్యాధునిక 3డీ ఎలక్ట్రో-అనాటామికల్ మ్యాపింగ్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్(ఆర్ఎవీఫఏ) ద్వారా డాక్టర్లు చికిత్స నిర్వహించారు. ఇద్దరికి స్వస్థత చేకూర్చారు. చికిత్స నిర్వహించిన వారిలో డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ సాయి రామ్ ఉన్నారు

# పులులతోనే అడవులకు మనుగడ !

**జనవరి 3 ప్రజావినికిడి,**
పర్యావరణానికి పులలకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని



దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్ర లోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి పులులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నాయి. అక్కడి టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ ప్రాణహిత నది దాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సీజన్‌లో తాడోబా నుంచి సుమారు 3-4 పులులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని, దీంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాలు ఇప్పుడు 'టైగర్ జోన్'గా మారిపోయిందని చెప్తున్నారు. కాగా ఈ పులుల్లో కొన్ని వెనక్కి వెళ్లిపోతుండగా, మరికొన్ని తిర్యాణి, పెంచికల్‌పేట రేంజ్‌లలో ఆవాసం కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వస్తున్న పులులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి మొదలైన ఓ టైగర్ జర్నీ మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల మీదుగా సాగి సిద్దిపేట జిల్లాలోకి చేరింది. తొగుట, మిరుదొడ్డి, కొండాపూర్ మండలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని, సిద్దిపేట పట్టణానికి దగ్గరగా కూడా వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పులి కనిపించడం ఇదే తొలిసారి. కొత్త ఆవాసం కోసమో.. తోడు కోసమో ఈ పులి దాదాపు 300 కిలోమీటర్లకుపైగా నడిచి ఉంటుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ పులి రాష్ట్రంలోని 14 జిల్లాలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలోనూ పులి సంచారం కలవరపెడుతోంది. ఇటీవల భూపాలపల్లి అడవి నుంచి జకారం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ అంబులెన్స్ డ్రైవర్ చూసినట్టు స్థానికులు చెబుతున్నారు. ములుగు,అబ్బాపూర్, జాకారం, పందికుంట బీట్లలో పులి పాదముద్రలను గుర్తించారు.

# ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు బాసట
## అదనంగా 4వేల ప్రోత్సాహం ఇవ్వాలన్న మాధవ్


విజయవాడ**జనవరి 3 ప్రజావినికిడి,**
ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అదనంగా రూ.4 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సహజ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానంతో మంచి దిగుబడి సాధించిన అన్నదాతలను మాధవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు మాధవ్. ప్రకృతి వ్యవసాయం చేసే వారి ఇబ్బందులు, కొత్త పద్ధతులు, ఆదర్శవంతమైన సాగుచేసే వారితో నేడు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు పీవీఎన్ మాధవ్.ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా విజయవంతమైన రైతన్నల అభిప్రాయాలు, అనుభవాలు వివరించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫసల్ భీమా, రైతులకు ఇన్‌ఫుట్ సబ్సీడీ ఇచ్చేలా భరోసా ఇచ్చారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో ముప్పై శాతం మంది ప్రకృతి వ్యవసాయం రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. ఆర్థిక స్వావలంబన కావాలంటే ప్రకృతి వ్యవసాయ విధానమే మార్గమని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్. ఇతర దేశాలపై ఆధారపడి యూరియా, పురుగు మందులు కొనే విధానం ఆగిపోవాలని సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రైతు బజార్లలో కొన్ని స్టాల్స్‌ను పెడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులతో ప్రత్యేకంగా సంతలు, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. కేంద్రం అమలు చేసే పథకాల గురించి అందరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. ఈరోజు సదస్సులో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

# అంతర్వేది రథ శకలాల నిమజ్జనం
## మరోమారు వాయిదా వేసిన దేవాదాయశాఖ

అమరావతి**జనవరి 3 ప్రజావినికిడి,**
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథ శకలాల నిమజ్జన కార్యక్రమం వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథం దహనమైన సంగతి తెలిసిందే. ఆ రథం స్థానంలో కొత్త రథాన్ని అంతర్వేది దేవస్థానం ఏర్పాటు చేసింది. పాత రథాన్ని ఆగమశాస్త్ర విధానాలు, నిబంధనలకు లోబడి నిమజ్జనం చేసే కార్యక్రమంపై ఇటీవలే దేవాదాయ శాఖ కార్యాచరణ ప్రకటించింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రథ



శకలాల నిమజ్జనం చేయాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రకటించింది. ఆగమశాస్త్ర నిబంధనలు, మూహూర్తాలపై చర్చించిన అనంతరం దేవాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. మరింత విస్తృత చర్చల అనంతరం... పూర్తి స్థాయి ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం అభిప్రాయాలు సేకరించి రథ శకలాలను నిమజ్జనం చేయాలని నిర్ణయించింది. భక్తుల మనోభావాల నేపథ్యంలో నిమజ్జన పక్రియను మరో ముహూర్తంలో అత్యంత శాస్త్రబద్దంగా జరపాలని దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

-------------------

# తెలుగు మహాసభలకు అంకురార్పణ

**శ్రీనివాస కళ్యాణంతో కార్యక్రమానికి శ్రీకారం**

గుంటూరు, **జనవరి 3 ప్రజావినికిడి,**మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు అంకురార్పణ జరిగింది. శనివారం ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఇక నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతు న్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పలువురికి పురస్కారాలను అందజేయనున్నారు. ఐదు సువిశాల వేదికల్లో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలకు గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారు. ఆదివారం ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ పాల్గొననున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఒక దేశాధ్యక్షుడు రావడం ఇదే ప్రథమం. ఇక సోమవారం నాడు జరిగే మహాసభల్లో సీఎం చంద్రబాబు నాయుడు,మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొననున్నారు. ప్రముఖుల హాజరుతో ప్రపంచ తెలుగు మహాసభలు మరింత వైభవంగా సాగనున్నాయి.

----------------

# ఎన్నికలకు ముందే మహాయతి దూకుడు
## పురపోరులో 68 స్థానాలు చిక్కించుకున్న కూటమి

ముంబై,**జనవరి 3 ప్రజావినికిడి,**
మహారాష్ట్ర పురపోరులో.. అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ పక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలపై అధికార ప్రభుత్వం ఆనందం వ్యక్తంచేసింది. ఈ విజయాలపై శివసేన పార్టీ (ఉద్ధవ్ ఠాక్రే) స్పందిస్తూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర సంస్థలను అడ్డుగా పెట్టుకొని ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించడం, లంచం ఇవ్వడంతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కారని ఆరోపించింది. ఇక, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

-----------

# భయపెడుతున్న మధుమేహం..
# దేశంలో తగ్గుతున్న చక్కెర వినియోగం!

**జనవరి 3 ప్రజావినికిడి,**
భారతీయుల ఆహారపు అలవాట్లలో కీలక మార్పు చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు ఏటా 4 శాతానికి పైగా పెరిగే చక్కెర వినియోగం ఇప్పుడు గణనీయంగా మందగించిందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. 2024-25లో 28.1 మిలియన్ టన్నులుగా ఉన్న వినియోగం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వల్పంగా పెరిగి 28.5 మిలియన్ టన్నులకు చేరుకోవచ్చని ఇండియన్ షుగర్ అండ్ బయో-ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) అంచనా వేసింది. 2023-24లో నమోదైన 29 మిలియన్ టన్నుల వినియోగం కంటే ఇది తక్కువ కావడం గమనార్హం.దేశంలో ప్రస్తుతం 10 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు, మరో 13.6 కోట్ల మంది ప్రీ-డయాబెటిక్ దశలో ఉండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. టైప్-2 డయాబెటిస్, గుండె



జబ్బులు, ఊబకాయం వంటి ముప్పుల నుంచి తప్పించుకోవడానికి యువత చక్కెర వినియోగాన్ని తగ్గిస్తున్నారు. సాదా చక్కెరకు బదులుగా స్టెవియా వంటి కృత్రిమ తీపి పదార్థాలతో పాటు సహజసిద్ధమైన బెల్లం, ఖర్జూరం, పండ్ల నుంచి వచ్చే చక్కెరను ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అయితే, కృత్రిమ తీపి పదార్థాలను అతిగా వాడటం వల్ల క్యాన్సర్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, దేశంలో చక్కెర ఉత్పత్తి మాత్రం గణనీయంగా పెరగనుంది. అనుకూల వర్షపాతం కారణంగా 2025-26 సీజన్‌లో ఉత్పత్తి 30.95 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. ఒకవైపు వినియోగం తగ్గుతుండటం, మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెజిల్ చక్కెర ధరలతో పోటీ పడలేక ఎగుమతులు మందగించడం పరిశ్రమను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో, అదనపు నిల్వలను సమతుల్యం చేయడానికి ఇథనాల్ ఉత్పత్తిపై పాత విధానాలను పునరుద్ధరించాలని చక్కెర మిల్లుల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# బంగ్లాలో ఆగని దాడులు
## వరుస దాడుల్లో హిందువుల హతం -తాజాగా మరో హిందూ వ్యాపారి మృతి

ఢాకా, **జనవరి 3 ప్రజావినికిడి,**బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలయ్యాడు..వరుస దాడులతో హిందువులు భయాందోళనలకు గురవుతున్నారు.బంగ్లాదేశ్ లో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. వరుసగా హిందువులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్(50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడి చేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారి నుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల దుకాణాన్ని మూసి ఆటోలో ఇంటికి బయలుదేరగా.. మార్గమధ్యలో కొందరు దుండగులు ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో చంద్రదాస్‌పై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. వారి నుంచి తప్పించుకునేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశారు. తర్వాత స్థానికులు ఆయనను కాపాడి.. ఆస్పత్రికి తరలించారు. తమకు శత్రువులు ఎవరూ లేరని, ఆయనపై ఎందుకు దాడి చేశారో తెలియదని ఖోకన్ భార్య సీమా దాస్ పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దీపూదాస్ హత్య జరిగింది. కొన్ని రోజులకు సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూక దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఖోకన్‌పై దాడి జరగ్గా.. ఆయన తాజాగా మరణించాడు.

## కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహ్మాన్ తొలగింపు




కేకేఆర్ జట్టులో మరో ఆటగాడిని భర్తీ చేసుకునేందుకు బీసీసీఐ అనుమతిఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు కేకేఆర్ శనివారం అధికారికంగా ప్రకటించింది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ స్పష్టం చేసింది. ఈ విషయంపై కేకేఆర్ ఒక ప్రకటన విడుదల చేసింది. “ఐపీఎల్ నియంత్రణ సంస్థ అయిన బీసీసీఐ ఆదేశాల మేరకు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి విడుదల చేశాం. నిబంధనల ప్రకారం అతని స్థానంలో మరో ఆటగాడిని భర్తీ చేసుకునేందుకు బీసీసీఐ అనుమతించింది. దీనికి సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తాం“ అని కేకేఆర్ తెలిపింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా కూడా ధ్రువీకరించారు. ఇటీవలి పరిణామాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపినప్పటికీ, దీని వెనుక బలమైన కారణం ఉన్నట్లు తెలుస్తోంది. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీ వర్గాలపై జరిగిన దాడుల నేపథ్యంలో తీవ్ర వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌లో ఆడించడంపై విమర్శలు వెల్లువెత్తడంతో బీసీసీఐ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ రికార్డు స్థాయిలో రూ. 9.20 కోట్లకు కొనుగోలు చేసింది. రూ. 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడి కోసం చెన్నై, ఢిల్లీ ఫ్రాంచైజీలతో కేకేఆర్ తీవ్రంగా పోటీపడి దక్కించుకుంది. 2016లో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన ముస్తాఫిజుర్, ఇప్పటివరకు 60 మ్యాచ్‌లు ఆడి 65 వికెట్లు పడగొట్టాడు.

# శ్రేయాస్ వచ్చేశాడు

## హార్దిక్‌కు విశ్రాంతిషమీకి మొండిచేయి




న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత జట్టు న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడబోతోంది. ఈనేపథ్యంలో శనివారం జాతీయ సెలెక్టర్లు 15 మందితో కూడిన ఆటగాళ్ల జాబితాను వెల్లడించారు. ఈనెల 11, 14, 18 తేదీలలో వడోదర, రాజ్‌కోట్, ఇండోర్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో సిరీవీసకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టు పగ్గాలు చేపట్టగా, శ్రేయాస్ అయ్యర్‌ను కూడా జట్టులో చేర్చారు. గతేడాది ఆసీస్ పర్యటనలో తీవ్రంగా గాయపడిన అతను ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ నుంచి అనుమతి లభించింది. ఈనెల 6న హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్ ద్వారా అతడి ఫిట్‌నెవీసపై అంచనాకు రానున్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బంది లేకపోతే తను కివీవీసతో సిరీవీసలో ఆడతాడని సెలెక్టర్లు ప్రకటించారు. ఇక సఫారీలతో వన్డే సిరీవీసకు దూరమైన హైదరాబాదీ పేసర్ సిరాజ్ కూడా జట్టులోకి వచ్చాడు. బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో అతను పేస్ బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే దేశవాళీల్లో రాణిస్తోన్న వెటరన్ మహ్మద్ షమీకి ఇక భారత జట్టు తలుపులు మూసుకుపోయినట్టుగానే భావించాలి. ఎప్పటిలాగే అతడిని ఈసారీ పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని హార్దిక్‌తో 10 ఓవర్లు బౌలింగ్ వేయించేందుకు సీఓఏ అనుమతివ్వలేదు. దీంతో అతడికి విశ్రాంతినిచ్చారు. అయ్యర్ స్థానంలో వచ్చి దక్షిణాఫ్రికాపై సిరీవీసలో సెంచరీ బాదిన రుతురాజ్‌తో పాటు కీపర్ జురెల్, తిలక్ వర్మలను పక్కనబెట్టారు. రెండో వికెట్ కీపర్‌గా పంత్ కొనసాగనున్నాడు. సిరాజ్, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ పేస్ విభాగంలో ఉండగా, పెద్దగా రాణించలేకపోతున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ స్థానం నిలుపుకోవడం గమనార్హం. ఇదిలావుండగా వెటరన్ స్టార్ ఆటగాళ్లు విరాట్, రోహిత్ ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో వీరి ఆట కోసం ఎప్పటిలాగే స్టేడియాలు కళకళలాడతాయనడంలో సందేహం లేదు.

# సర్వీసెస్‌పై ఢిల్లీ విజయం..

# అదరగొట్టిన రిషబ్ పంత్



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ 37 బంతుల్లో 67 పరుగులతో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జనవరి 11న వడోదరలో న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ సిరీస్ కోసం సెలక్టర్లు భారత జట్టును ప్రకటించే సమయంలో పంత్ 4 ఫోర్లు, 6 సిక్సర్లతో చెలరేగిపోయాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ 178 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో వికాస్ హత్వాలా (26) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ పుల్కిత్ నారంగ్ (22), టెయిలెండర్లు పూనమ్ సుభాష్ పూనియా (23), రాజ్ బహదూర్ పాల్ (25) కొంతమేర రాణించారు. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ కేవలం 19.4 ఓవర్లలోనే ఛేదించింది. ఢిల్లీ జట్టులో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య 45 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 72 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ రిషబ్ పంత్ (67), నితీశ్ రాణా (32) కూడా రాణించారు. ఢిల్లీకి ఇది ఐదు మ్యాచ్‌లలో నాలుగో విజయం కావడం విశేషం.

# న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్..



ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచ కప్ 2026కి ముందు టీమిండియా న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. జనవరి 11 నుంచి స్వదేశంలోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచ కప్‌నకు సంబంధించి ఇప్పటికే బీసీసీఐ జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వన్డే సిరీస్‌కు మాత్రం కాస్త సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు శనివారం బీసీసీఐ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సంబంధించి టీమిండియా జట్టును ప్రకటించింది.

భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (%జశీజు%)లో ఇంటెన్సివ్ రిహాబ్ బ్లాక్‌ను శ్రేయస్ పూర్తిచేసుకున్నాడు. గతేడాది అక్టోబర్ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో క్యాచ్ అందుకునే క్రమంలో శ్రేయస్‌కు తీవ్రమైన గాయమైంది. దీంతో తర్వాత జరిగిన మ్యాచ్‌లకు అయ్యర్ దూరమయ్యాడు. డిసెంబర్ 25న (%జశీజు%)లో చేరిన శ్రేయస్.. స్ట్రెంత్ అండ్ కండీషనింగ్‌లో పురోగతి సాధించాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో నాలుగు సెషన్లపాటు కఠినమైన సాధన పూర్తి చేశాడు. మ్యాచ్ సిమ్యులేషన్ సెషన్స్‌లోనూ పాల్గొన్నాడు. దీంతో జట్టులో చోటు దక్కించుకున్నాడు. షమీకి మాత్రం మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల దేశవాళీల్లో ఆకట్టుకున్న షమీకి చోటు దక్కుతుందని అంతా భావించారు. కానీ సెలక్టర్లు అతడిని ఎంపిక చేయలేదు.

**భారత తుది జట్టు ఇదే..:**శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, జడేజా, సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

# భారత ఫుట్‌బాల్‌ను కాపాడండి!..





భారత ఫుట్‌బాల్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్-ఎల్) భవితవ్యంపై అనిశ్చితి నెలకొనడంతో దేశీయ దిగ్గజ ఆటగాళ్లు గొంతు విప్పారు. భారత ఫుట్‌బాల్ ఐకాన్ సునీల్ ఛేత్రి, గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు, డిఫెండర్ సందేశ్ ఝింగన్ ఈ విషయంలో ఫిఫాను నేరుగా జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ విజ్ఞప్తిలో భారతీయులతో పాటు విదేశీ ఆటగాళ్లు కూడా భాగస్వాములయ్యారు.ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండిఏఐఎఫ్ఎఫ్ (అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య)ఈవెంట్ నిర్వాహకుల మధ్య మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎంఆర్‌ఏ) పునరుద్ధరణ జరగకపోవడంతో 2025 జూలైలో ఐఎస్ఎల్ నిలిచిపోయింది. అప్పటి నుంచి వాణిజ్య భాగస్వామి లేక ఏఐఎఫ్ఎఫ్ దిక్కుతోచని పరిస్థితిలో ఉంది. ఈ ప్రతిష్టంభన కొనసాగుతుండటంతో ఆటగాళ్లు మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. మేం మైదానంలో ఉండాలి..సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసిన ఓ వీడియోలో పలువురు ఫుట్‌బాల్ దిగ్గజాలు మాట్లాడారు. ‘ఇప్పటికే జనవరి వచ్చింది. ఈ సమయానికి మేం ఐఎస్ఎల్ మ్యాచ్‌లతో మీ స్క్రీన్లపై ఉండాలి. కానీ అలా లేదు’ అని గుర్‌ప్రీత్ ఆవేదన వ్యక్తం చేశాడు. ‘మేం అందరికీ తెలిసిన నిజాన్నే భయం, నిరాశతో బయటపెట్టాల్సి వస్తోంది’ అని ఝింగన్ అన్నాడు. ‘ఆటగాళ్లు, సిబ్బంది, యజమానులు, అభిమానులు.. అందరికీ ఈ విషయంపై ఓ స్పష్టత రావాలి. ముఖ్యంగా ఫుట్‌బాల్‌కు ఓ భవిష్యత్తు కావాలి’ అని సునీల్ ఛేత్రి(ాబఅఱశ్రీ జష్ట్రష్ట్రవ్‌తీఱ) స్పష్టం చేశాడు. ఫిఫాకు నేరుగా విజ్ఞప్తి‘భారత ఫుట్‌బాల్ పాలన వ్యవస్థ తన బాధ్యతలను నెరవేర్చలేని స్థితికి చేరింది. మేం శాశ్వత స్థబ్దత అంచున ఉన్నాం. ఇది చివరి ప్రయత్నం. భారత ఫుట్‌బాల్‌ను కాపాడేందుకు ఫిఫా(ఖీ×ఖీూ) జోక్యం చేసుకోవాలి. ఇది రాజకీయ పిలుపు కాదు. అవసరం వల్ల వచ్చిన విజ్ఞప్తి. ప్రస్తుతం మేం మానవతా, క్రీడా, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. మాకు సహాయం కావాలి. మేం కేవలం ఫుట్‌బాల్ ఆడాలనుకుంటున్నాం’ అని ఆ వీడియోలో ఆటగాళ్లు పేర్కొన్నారు. మొత్తానికి, భారత ఫుట్‌బాల్ భవితవ్యంపై మబ్బులు కమ్ముకున్న వేళ, ఆటగాళ్ల ఆవేదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఫిఫా జోక్యం చేసుకుంటుందా? ఐఎస్ఎల్ తిరిగి ప్రారంభమవుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.



## విజయ్ హజారే ట్రోఫీలో చెలరేగిన తిలక్ వర్మ



విజయ్ హజారే ట్రోఫీ 2025%-%26 సీజన్‌ను హైదరాబాద్ కెప్టెన్, టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుతంగా ఆరంభించాడు. టోర్నీలో తాను ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతకం సాధించి తన క్లాస్ ఏంటో మరోసారి నిరూపించాడు. రాజ్‌కోట్ వేదికగా చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో తిలక్ సూపర్ సెంచరీతో హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టుకు ఆరంభం మాత్రం తీవ్ర నిరాశ కలిగించింది. ఓపెనర్లు అమన్ రావ్ (13), తన్మయ్ అగర్వాల్ (16) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరడంతో స్కోరు బోర్డు ఒత్తిడిలో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. ఆరంభంలో చాలా ఓపికగా ఆడిన తిలక్, క్రీజులో కుదురుకున్న తర్వాత బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. సరైన బంతులను ఎంచుకుంటూ బౌండరీలు సాధించడమే కాకుండా, అవసరమైనప్పుడు భారీ షాట్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అభిరత్ రెడ్డి (71)తో కలిసి కీలకమైన 114 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి హైదరాబాద్ ఇన్నింగ్స్‌కు పునాది వేశాడు.

మొత్తంగా 118 బంతులు ఎదుర్కొన్న తిలక్ వర్మ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 పరుగులు చేసి ఔటయ్యాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఫలితంగా హైదరాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. చండీగఢ్ బౌలర్లలో జగజీత్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా, రోహిత్ దండా, హర్ తేజస్వి కపూర్, విశూ కశ్యప్ తలా రెండు వికెట్లు సాధించారు. ఇదిలా ఉండగా, న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో తిలక్ వర్మకు జట్టులో చోటు దక్కుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో తిలక్ జట్టులో ఉన్నప్పటికీ, ఈసారి కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి రానుండటంతో తిలక్‌పై వేటు పడే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతోంది.

# మన శంకరవరప్రసాద్ గారు పోస్టర్ విడుదల




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.

# నటనపై ఆసక్తి లేదన్న దర్శకుడు

## అలాంటి గ్రాప్‌లో పడనన్న అనిల్ రావిపూడి



ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీకి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన స్టేజ్‌పై మాట్లాడే తీరు, కామెడీ టైమింగ్, మాస్ పల్స్ చూసి 'హీరో మెటీరియల్' అంటూ అభిమానులు కామెంట్స్ చేయడం కొత్త కాదు. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు. మనమొక క్రాఫ్ట్‌లో టాప్‌లో ఉన్నప్పుడు పక్కదారి పట్టించడానికి ఇలాంటి ప్రలోభాలు వస్తాయి. వాటికి లొంగితే ఇప్పటికే ఉన్న కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఆ ట్రాప్‌లో నేను పడను. నాకు హీరోగా మారాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. డైరెక్షన్‌పైనే పూర్తి దృష్టి పెడతాను అని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. టాలీవుడ్‌లో దర్శకుడు రాజమౌళి తర్వాత ఫెయిల్యూర్ లేని ట్రాక్ రికార్డ్ ఉన్న డైరెక్టర్‌గా అనిల్ రావిపూడికి మంచి పేరు ఉంది. ఆ రికార్డును కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, నటన వైపు వెళ్లి ఫోకస్ డైవర్ట్ చేయాలనే ఆలోచన తనకు లేదని ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి పూర్తిగా మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాపైనే దృష్టి పెట్టారు.

# రజనీతో కమల్ మూవీ

## డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.

------



# బాక్సాఫీస్ వసూళ్లతో నాకేం పని!

బాక్సాఫీస్ వసూళ్లతో నాకేం పని!సినిమా సక్సెస్ అయితే? అందులో అందరూ భాగస్వాములవుతారు. సక్సెస్ లో ఎవరికివారు తమ పాత్రే కీలకమంటారు. ముఖ్యంగా ఈ రకమైన చర్చ దర్శక, హీరోల మధ్య కొంత కాలం క్రితం ఉండేది. ఇప్పుడా బాధ్యత చాలా వరకూ దర్శకుడే తీసుకుంటున్నాడు. కొంత మంది హీరోలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వైఫల్యం గురించి కూడా ఓపెన్ అవుతున్నారు. సక్సెస్ అయినా? ఫెయిలైనా ఇందులోకి ఇన్వాల్వ్ కానిది ఎవరు? అంటే హీరోయిన్లు..సినిమాలో ఇతర నటీనటులు. సినిమా హిట్ అయితే అందరితో పాటు తమకి పేరొస్తుంది.లేకపోతే లేదు అని లైట్ తీసుకునే వాళ్లు కొందరుండగా? మరికొంత మంది అంతే బాధ్యతగానూ ఉంటారు. సక్సెస్..ఫెయిల్యూర్ ని ఓ ఒత్తిడిగా భావిస్తుంటారు. తాజాగా ఈ విషయంపై బాలీవుడ్ నటి కృతిసనన్ కూడా ఓపెన్ అయింది. తాను ఎలాంటి కథ ఎంపిక చేసుకున్నా? ఒకదాని కొకటి భిన్నంగా ఉండాలనే కోరుకుంటానంది. నటించిన అన్ని సినిమాలు అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించాలని ఆశించకూడదంది. ఏ సినిమా నచ్చుతుందో? ఏ సినిమా నచ్చదో అంచనా వేయడం అంత సులభం కాదంది. తనకు నచ్చిన సినిమా తన పక్క సీట్లో కూర్చున్న మరొకరికి నచ్చకపోవచ్చు.సినిమా ఫలితాలు..బాక్సాఫీస్ ఫలితాల గురించి అయితే ఆసలే ఆలోచించనంది. ఏ సినిమాకు కమిట్ అయినా నిజాయితీగా పనిచేసి బయటకు రావడం తప్ప! మిగతా ఏ విషయాలు కూడా పట్టించుకోనంది. వాటిని అనవసరమైన విషయాలగానే పరిగణిస్తానంది. సినిమాలో తన పాత్ర ఎంత వరకూ అన్నది ముందే డిసైడ్ అయిపోతుందట. ఆ ప్రకారమే తాను ముందుకెళ్తానంది. అనవసరంగా దర్శక, నిర్మాతలతో పూసుకోవడం వంటి పనులు నచ్చవంది. చేసిన పని నిజాయతీగా పనిచేసి బయటకు వచ్చేయడంతో సరి. బాక్సాఫీస్ వద్ద సినిమా ప్రభావం చూపాలంటే ఎన్నో అంశాలుంటాయంది.అవన్నీ దర్శకుడి మీద..అతడి పనితనంపై ఆధారపడి ఉంటాయి. వాటిలో నటులు ఎలా భాగమవుతారంది. కాబట్టి వాటి గురించి ఎంత మాత్రం టెన్షన్ తీసుకోనంది. ఎంత పెద్ద సినిమా రిలీజ్ అయినా ఏ మాత్రం ఒత్తిడికి గురికా నంది. తాను ఏ సినిమాకు పని చేసినా కేవలం పాత్రలో ప్రయాణాన్ని మాత్రమే ఆస్వాదిస్తానంది. ఈ బ్యూటీ గత ఏడాది నవంబర్ లో రిలీజ్ అయిన 'తేరే ఇష్క్ మే' తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 150 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. 'దో పత్తి' తో నిర్మాత గానూ ప్రయాణం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. కానీ తొలి సినిమా ఆశించిన ఫలితాలు సాధించలేదు. నటిగా అదే ఏడాది 'క్రూ'తో కూడా మరో భారీ విజయాన్నే అందుకుంది. ప్రస్తుతం 'కాక్ టెయిల్ 2' లో నటిస్తోంది.




# అఖిల్ అక్కినేని 'లెనిన్' మూవీలో 'భారతి'గా భాగ్యశ్రీ బోర్సే...




అక్కినేని అఖిల్ హీరోగా, మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ కీలకమైన అప్డేట్ ఇచ్చారు. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆమె 'భారతి' అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించారు.నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకుంది. "లెనిన్ ప్రేమ.. భారతిని పరిచయం చేస్తున్నాం" అనే క్యాప్షన్‌తో పోస్టర్‌ను రిలీజ్ చేసింది. అంతేకాకుండా, సినిమా నుంచి మొదటి సింగిల్‌ను జనవరి 5న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ పోస్టర్ ద్వారా 2026 వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.నిజానికి ఈ సినిమాలో కథానాయికగా మొదట శ్రీలీలను ఎంపిక చేశారు. అయితే, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకున్నారు. గతంలో అఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.'యుద్ధం కంటే హింసాత్మకమైనది ప్రేమలో లేదు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి అక్కినేని నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, నవీన్ కుమార్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిల కాంబో

## గాంధీ టాక్స్ ..మూకీ డ్రామా



భారతీయ చలనచిత్ర తెరపై దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక అద్భుత ప్రయోగం ఆవిష్కృతం కాబోతోంది. అప్పట్లో కమల్ హాసన్ నటించిన 'పుష్పక విమానం' వంటి మూకీ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత, అదే స్థాయిలో భావోద్వేగాలను పండించడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ 'జీ స్టూడియోస్' ఈ చిత్రాన్ని గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్దార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. మాటలు లేని ఈ సినిమాలో సంగీతమే ప్రాణం. అందుకే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత, మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందిస్తున్నాడు. కిషోర్ పి. బేలేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమేష్ కుమార్ బన్సల్, రాజేష్ కేజీవ్రాల్, మీరా చోప్రా, కిషోర్ పాండురంగ్ బేలేకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216